

ఆకట్టుకున్న మెహందీ

జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మ చెరువు సమీప శ్రీహనుమాన్ ఆలయంలో శుక్రవారం మార్వాడీ మహిళా సమాజ్ ఆధ్వర్యంలో మెహందీ వేడుక ఘనంగా జరుపుకున్నారు. తొలుత గోదాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. భజనలతో కొలిచారు. అనంతరం మెహందీ వేడుక జరుపుకున్నారు. ఏటా గోదాదేవికి ప్రత్యేక పూజలు చేశాక వేడుకలు నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. – పెద్దపల్లిరూరల్



న్యూస్‌రీల్

జాతీయ పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న అధ్యాపకులు

ధర్మారం(ధర్మపురి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి మడ్డి వంశీ హ్యాండ్‌బాల్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ దురిశెట్టి అనంతరామకృష్ణ తెలిపారు. మహబూబ్‌నగర్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్– 17 విభాగం రాష్ట్రస్థాయి పోటీల్లో కరీంనగర్ జట్టు తరఫున పాల్గొన్న వంశీ.. ప్రతిభ కనబర్చి సిల్వర్ మెడల్ సాధించినట్లు వివరించారు. వంశీని ప్రిన్సిపాల్ అనంతరామకృష్ణ, అధ్యాపకులు శుక్రవారం సన్మానించి అభినందించారు.

చైనా మాంజాపై నిషేధం



రమేశ్

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని సబ్ డివిజన్ పరిధిలో చైనా మాంజాపై నిషేధం విధించినట్లు గోదావరిఖని ఏసీపీ రమేశ్ తెలిపారు. చైనా మాంజాను విక్రయించినా, ఉపయోగించినా, ఎవరికైనా ప్రమాదం జరిగినా, నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించినా వారిపై కఠిన చర్యలు తప్పవని ఏసీపీ హెచ్చరించారు.

చంద్రకళకు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న చంద్రకళ

జ్యోతినగర్(రామగుండం): హైదరాబాద్‌లో శుక్రవారం సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా బీసీ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సామాజిక సేవకురాలు గోలివాడ చంద్రకళ సావిత్రీ బాయి పూలే రాష్ట్రస్థాయి ప్రతిభా పురస్కారం అందుకున్నారు. ఆమె 25 ఏళ్లుగా రామగుండం నియోజకవర్గంలో మహిళా సాధికారత, మహిళా అభ్యుదయం కోసం కృషి చేస్తున్నారు. బీసీ మహిళా సంక్షేమ సంఘం ప్రతినిధులు చంద్రకళను ప్రత్యేకంగా అభినందించి, శాలువాతో సత్కరించి, మెమొంటో అందజేశారు.

మహిళా విద్య కోసం ఉద్యమించిన నేత



నివాళి అర్పిస్తున్న మేయర్ అనిల్ కుమార్

కోల్‌సిటీ(రామగుండం): మహిళా విద్య కోసం ప్రథమంగా గళమెత్తిన నేత సావిత్రీబాయి పూలే అని రామగుండం నగర మేయర్ బంగి అనిల్‌కుమార్ అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం సావిత్రీబాయి పూలే జయంతి నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ, కుల వ్యవస్థ, పితృస్వామ్యం, అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమించిన సావిత్రీబాయి అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. కార్పొరేటర్ బాల రాజ్‌కుమార్, నాయకులు పాతపెల్లి ఎల్లయ్య, పెద్దెల్లి ప్రకాశ్, బల్దియా అసిస్టెంట్ కమిషనర్ రాయలింగు, సీనియర్ అసిస్టెంట్ పబ్బాల శ్రీనివాస్, సిబ్బంది, అంబేడ్కర్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

మద్యపానంపై నిషేధాజ్ఞలు



శ్రీనివాస్, సీపీ

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లోని బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై నిషేధాజ్ఞలను ఫిబ్రవరి వరకు పొడిగిస్తున్నట్లు పోలీస్ కమిషనర్(సీపీ) శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, మందుబాబుల ఆగడాలపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. అదేవిధంగా అనుమతి లేకుండా డీజే సౌండ్, డ్రోన్లు వినియోగిస్తే చర్యలు తప్పవన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, పేషెంట్లు, విద్యార్థులకు ఇబ్బందులులు తలెత్తకుండా, శబ్ద కాలుష్యం నియంత్రణకు డీజే సౌండ్ వినియోగంపై నిషేధాజ్ఞలు విధించినట్లు స్పష్టం చేశారు. వివిధ కార్యక్రమాల సందర్భంగా ప్రజల సమీకరణ, ప్రదర్శనల కోసం మైక్ సెట్‌లను మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. డీజే సౌండ్ తప్పనిసరైతే ఏసీపీల నుంచి అనుమతి పొందాలని పేర్కొన్నారు. నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

ఆర్టీసీ ఓవర్‌లోడ్

విరుగుతున్న పట్టీలు.. అరుగుతున్న టైర్లు

- మహాలక్ష్మి పథకం అమలుతో పెరిగిన ప్రయాణికుల రద్దీ
- ఒక్కోదాంట్లో వంద మందికి పైగా ప్రయాణం
- నెలలో మరమ్మతుకు 100కు పైగా బస్సులు
- టికెట్లు ఇచ్చేందుకు కండక్టర్ల తిప్పలు
- తగ్గిన అద్దె బస్సుల సంఖ్య
- కరీంనగర్ రీజియన్‌లో పరిస్థితి



కరీంనగర్ బస్టాండ్‌లో పోటీ పడి బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలన్న ఉద్దేశంతో అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ఆర్టీసీకి భారంగా మారింది. పథకం ప్రారంభం తర్వాత బస్సుల్లో ప్రయాణికులు రద్దీ పెరిగింది. సిట్టింగ్ కెపాసిటీ కంటే రెండింతలకు పైగా ప్రయాణం చేస్తుండటంతో బస్సులకు తరచూ మరమ్మతు చేయాల్సి వస్తోంది. 50 మంది ప్రయాణించాల్సిన బస్సులో 100 మందికి పైగా రాకపోకలు సాగిస్తున్నారు. ఓవర్‌లోడ్ సమస్యతో ప్రయాణికులు, ఆర్టీసీ యాజమాన్యం సైతం ఇబ్బందులకు గురవుతోంది.

కరీంనగర్✍:

మహాలక్ష్మి పథకానికి ముందు ప్రతీరోజు కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా 2.50 లక్షలకు పైగా ప్రయాణికులు బస్సుల్లో వెళ్లేవారు. ఇప్పుడు ఆ సంఖ్య రెట్టింపు అయ్యింది. గతంలో రూ.కోటి నుంచి రూ.1.20 కోట్ల వరకు ఆదాయం వచ్చేది. ప్రస్తుతం రూ.2 కోట్లపైనే వస్తుండటం విశేషం. 09 డిసెంబర్ 2023 నుంచి ఇప్పటివరకు రీజియన్ వ్యాప్తంగా 16.17 కోట్ల మంది ప్రయాణించారు. వీరిలో మహిళలే 11.11 కోట్ల మంది. 11 డిపోల పరిధిలో నిత్యం 800కు పైగాబస్సులు తిరుగుతున్నాయి. ఏడాది వ్యవధిలో రూ.876.39 కోట్ల ఆదాయం రాగా, 'మహాలక్ష్మి' ద్వారా రూ.445.63 కోట్లు(51 శాతం) సమకూరడం గమనార్హం. అయితే ప్రయాణికుల సంఖ్య రెట్టింపు కావడంతో బస్సులు రిపేర్‌కు వచ్చి ఎక్కడిక్కడ ఆగిపోతుండటం ఇబ్బందిగా మారింది.

మైలేజీ తక్కువ..

ఒక్కో బస్సులో అధిక సంఖ్యలో ప్రయాణికులు వెళ్తుండటంతో వాటి పట్టీలు తరచూ విరిగిపోతున్నాయి. టైర్లు తొందరగా అరిగిపోతున్నాయి. మైలేజీ సైతం తక్కువగా వస్తోంది. దీంతో సంస్థకు అదనపు భారం పడుతోంది. మెకానిక్‌లు ఎప్పటికప్పుడు బస్సులను రిపేర్ చేయలేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో నెలకు 50 బస్సులకు మరమ్మతు చేయాల్సి రాగా, ప్రస్తుతం ఆ సంఖ్య 100కు పైగా పెరిగినట్లు సమాచారం.

కండక్టర్లు, డ్రైవర్లతో గొడవ..

ప్రయాణికుల రద్దీతో కండక్టర్లు, డ్రైవర్లు అష్టకష్టాలు పడుతున్నారు. కండక్టర్లు బస్సు మొదటి నుంచి చివరి వరకు వెళ్లి, టికెట్ ఇచ్చే పరిస్థితి లేకుండా పోతోంది. కండక్టర్లు, డ్రైవర్లతో ప్రయాణికులు తరచూ గొడవలకు దిగుతున్నారు. సీట్ల కోసం పోటీ పడుతూ వారిలో వారే దూషించుకుంటున్నారు.

ఏడాదిలో రీజియన్ పరిధిలోని డిపోలవారీగా ఆదాయ వివరాలు

డిపో	ఆదాయం (రూ.లక్షల్లో)	మొత్తం ప్రయాణికులు	మహిళలు	మహాలక్ష్మి ఆదాయం (రూ.లక్షల్లో)
గోదావరిఖని	13,633.67	2,42,04,921	1,63,77,066	6,751.51
హుస్నాబాద్	4,234.47	1,10,52,288	76,40,424	2,566.95
హుజూరాబాద్	5,873.44	1,28,92,746	84,93,907	3,419.33
జగిత్యాల	11,912.87	2,19,55,251	1,54,71,192	6,073.82
కరీంనగర్–1	9,807.57	1,53,25,489	96,95,481	3,534.78
కరీంనగర్–2	10,412.20	1,76,19,312	1,13,83,867	4,785.71
కోరుట్ల	6,455.91	1,18,15,198	88,50,895	3,434.59
మంథని	5,573.88	87,72,558	58,75,482	3,139.79
మెట్‌పల్లి	5,981.04	1,18,93,086	89,12,298	3,677.85
రాజన్నసిరిసిల్ల	6,614.02	1,24,19,063	81,01,765	3,382.74
వేములవాడ	7,140.83	1,38,17,962	1,03,18,114	3,796.41

సమస్యలు పరిష్కరించాలి

అద్దె బస్సుల యాజమానులు చాలా సమస్యలతో పోరాడుతున్నారు. మహాలక్ష్మి పథకం వచ్చిన తర్వాత బస్సులు తరుచూ రిపేర్లకు గురవుతున్నాయి. ప్రభుత్వం ఉపశమనం కోసం రూ.5 వేలు పెంచినా ఏమాత్రం సరిపోవడం లేదు. డ్రైవర్లు సైతం జీతాలను పెంచారు. డ్రైవర్ల ఇబ్బంది కూడా ఉంది. టైర్లు సంస్థ నుంచి ఇప్పించాలి. ఆర్టీసీ యాజమాన్యం ఇచ్చేవాటిలో కట్ చేసుకొని టైర్లు ఇవ్వాలి. – పులి ప్రసాద్, అద్దె బస్సుల సంఘం అధ్యక్షుడు

అదనపు బస్సులు నడిపిస్తాం



ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తాం. రీజియన్ పరిధిలో కొంతమేర ఓవర్‌లోడ్ సమస్య ఉంది. ఆయా రూట్‌లలో అదనపు బస్సులు నడిపిస్తాం. 70 ఎలక్ట్రిక్ బస్సులు వచ్చాయి. వాటిని కూడా తిప్పుతాం. ఇప్పటికే ఎక్స్‌ప్రెస్, లగ్జరీ బస్సులను పెంచాం. మహాలక్ష్మి పథకం ప్రారంభించాక ప్రయాణికుల సంఖ్య, ఆదాయంలో హైదరాబాద్, సికింద్రాబాద్ రీజియన్‌ల తర్వాత కరీంనగర్‌దే అగ్రస్థానం. – రాజు, ఆర్‌ఎం, కరీంనగర్

400కు తగ్గిన అద్దె బస్సులు

మహాలక్ష్మి పథకం ప్రారంభించిన తర్వాత అద్దె బస్సుల సంఖ్య తగ్గింది. గతంలో కరీంనగర్ రీజియన్‌లో 800కు పైగా తిరగగా.. ప్రస్తుతం 400కు తగ్గాయి. రోజువారీ రిపేర్లు వస్తుండటంతో వీటి సంఖ్య కూడా క్రమంగా తగ్గుతోంది. ప్రభుత్వం అద్దె బస్సులకు రూ.5 వేలు పెంచినా ఏమాత్రం సరిపోవడం లేదని వాటి యాజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

షెడ్డుకే పరిమితం



రీజియన్ పరిధిలో కొన్ని బస్సులకు కాలపరిమితి ఉన్నా.. అధిక సంఖ్యలో ప్రయాణికులను తీసుకెళ్లడంతో రిపేర్లకు గురై, షెడ్డుకే పరిమితమయ్యాయి. కరీంనగర్, తదితర రూట్‌లలో నడిచే నాన్‌స్టాప్ మినీ బస్సులు తరచూ మరమ్మతుకు గురవుతున్నాయి. మరోవైపు అధికారులు స్పందించి, బస్సుల సంఖ్య పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

హమాలీల సమ్మె ఉధృతం

- నిలిచిన లారీలు.. ఆగిన రేషన్ సరఫరా
- మూడురోజులుగా విధులకు కార్మికుల గైర్హాజరు



సుల్తానాబాద్ గోదాం ఎదుట నిలిచిన లారీలు



సుల్తానాబాద్‌లో మూతపడిన గోదాములు

సుల్తానాబాద్(పెద్దపల్లి): పెద్దపల్లి, మంథని, సుల్తాబాద్‌లోని మండల లెవల్ స్టాక్(ఎంఎల్ఎస్) పాయింట్లలో పనిచేసే హమాలీల సమ్మెతో జిల్లా వ్యాప్తంగా రేషన్ సరుకుల సరఫరా నిలిచిపోయింది. జిల్లా పౌర సరఫరాల శాఖ ఇక్కడి నుంచే జిల్లావ్యాప్తంగా ఉన్న రేషన్ డీలర్లకు సరుకులు పంపిణీ చేస్తోంది. అయితే, తమ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో హమాలీలు ఈనెల ఒకటో తేదీ నుంచి విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్నారు. దీంతో చౌకధరలు దుకాణాలకు బియ్యం సరఫరా పాక్షికంగా నిలిచిపోయింది.

సుల్తానాబాద్, పెద్దపల్లి, మంథనిలో ఎంఎల్ఎస్ పాయింట్లు

జిల్లాలోని సుల్తానాబాద్, పెద్దపల్లి, మంథనిలో మండల లెవెల్ స్టాక్ పాయింట్లు(ఎంఎల్ఎస్) ఉన్నాయి. తెల్లరేషన్‌కార్డులతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి కూడా ఇక్కడి నుంచే బియ్యం సరఫరా చేస్తారు. అంతేకాదు.. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, రెసిడెన్షియల్ స్కూళ్లు, సోషల్ వెల్ఫేర్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచే బియ్యం తరలిస్తారు. హమాలీల సమ్మెతో కొన్నిగ్రామాలకు పాక్షికంగానే బియ్యం సరఫరా అయిందని గోదాం ఇన్‌చార్జిలు చెబుతున్నారు.

480 రేషన్ షాపులు..

జిల్లాలో మొత్తం 480 రేషన్ షాపులు ఉన్నాయి. ప్రతినెలా సుమారు 3,400 టన్నులు రేషన్ బియ్యం వీటి ద్వారా పంపిణీ చేస్తున్నామని సివిల్ సప్లయి మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. గోదాముల్లోంచి లారీల్లో బియ్యం లోడ్ చేసుకుని గ్రామాలు, పట్టణాలు, నగరంలోని రేషన్ షాపులకు తరలిస్తున్నారు. అయితే, లారీల్లో లోడింగ్, అన్‌లోడ్ చేయాల్సిన హమాలీలు సమ్మె చేయడంతో బియ్యం సరఫరా తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని అధికారులు చెబుతున్నారు.

కూలి సవరణలో నిర్లక్ష్యం

ప్రభుత్వం నుంచి వచ్చే బియ్యాన్ని గోదాముల్లోకి అన్‌లోడ్ చేయడం, ఇక్కడి నుంచి రేషన్ దుకాణాలకు పంపించేందుకు లోడ్ చేయడంలో హమాలీలు అత్యంత కీలకం. వీరికి రెండేళ్లకోసారి కూలి సవరించాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే వారి కూలి రేట్లు పెంచుతున్నట్లు పౌర సరఫరాల కమిషనర్ రెండు నెలల క్రితం జీవో విడుదల చేశారు. కానీ, అది నేటికీ అమలు చేయడం లేదు. ఇందుకు అవసరమైన నిధులు కూడా విడుదల చేయడంలేదని హమాలీ నాయకులు చెబుతున్నారు. ఫలితంగా జనవరి 2024 నుంచి కూలి రెట్లు అమలు చేస్తామని చెప్పినా నేటికీ ఆచరణలోకి రావడం లేదని, దీంతోనే తాము సమ్మె చేయాల్సి వస్తోందని హమాలీలు, నాయకులు వివరిస్తున్నారు.

సమ్మె కొనసాగిస్తాం



మా సమస్యలు పరిష్కరించేంత వరకూ సమ్మె కొనసాగిస్తాం. బియ్యం బస్తాలతో లారీల్లోకి ఎక్కడం, దిగడంతో కాళ్లు, కీళ్ల నొప్పులు వస్తున్నాయి. ఒక క్వింటాలుకు కూలి రేటు రూ.35 చెల్లించాలి. మిగతా సమస్యలూ పరిష్కరించాలి. – మైలారం తిరుపతి, హమాలీ సంఘం నేత, సుల్తానాబాద్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా



గోదాముల్లోని హమాలీలు చేస్తున్న సమ్మె విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. రెండు రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని భావిస్తున్నాం. త్వరలోనే రేషన్ షాపులకు బియ్యం చేరుతాయి. – శ్రీకాంత్‌రెడ్డి, డీఎం, సివిల్ సప్లయ్

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- ప్రత్యేక తరగతుల నిర్వహణకు చర్యలు
- కలెక్టర్ కోయ శ్రీహర్ష వెల్లడి



ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీఈవో మాధవి

పెద్దపల్లిరూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాను రాష్ట్రంలోనే అగ్రభాగాన నిలపాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అన్నారు. టెన్త్ విద్యార్థుల కోసం రూపొందించిన కార్యాచరణ ప్రచార పోస్టర్‌ను శుక్రవారం తన కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. మార్చిలో నిర్వహించే వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు మంచిఫలితాలు సాధించేలా ప్రోత్సహించేందుకు వీలుగా వారిస్థాయి సామర్థ్యాలను పెంచాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని చెప్పారు. కార్యాచరణను బట్టి సబ్జెక్టుల వారీగా పరీక్షలు నిర్వహించాలన్నారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సబ్జెక్టులను దత్తత తీసుకుని విద్యార్థులను ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు వస్తాయని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మాధవి, సమగ్ర శిక్షా సమన్వయకర్త పీఎం షేక్ పాల్గొన్నారు.

బాలికా విద్యకు సావిత్రీబాయి కృషి

బాలికా విద్య కోసం సావిత్రీబాయి పూలే ఎంతగానో కృషి చేశారని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. కలెక్టరేట్‌లో సావిత్రీబాయి జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రభుత్వం సావిత్రీబాయి జయంతిని మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా పాటించాలని నిర్ణయించిందని అన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రతీ మండలం నుంచి ఓ మహిళా ఉపాధ్యాయురాలిని ఎంపిక చేసి సత్కరించుకుంటున్నామని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా సావిత్రీబాయి మహిళల కోసం ప్రత్యేకంగా పాఠశాలలను ప్రారంభించారని గుర్తుచేశారు. పలువురు మహిళా ఉపాధ్యాయులను కలెక్టర్, అధికారులు సత్కరించారు. డీఈవో మాధవి, సమగ్ర శిక్షా సమన్వయకర్త పీఎం షేక్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉపాధ్యాయులకు సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ధర్మారం మండలంలోని పలువురు ఉపాధ్యాయులతో కలెక్టర్ సమావేశమయ్యారు. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి అందుకు అనుగుణంగా ప్రోత్సాహం అందించాలని ఆయన సూచించారు. డీఈవో మాధవి, అకడమిక్ అధికారి పీఎం షేక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్‌గా ఓసీపీ–4

- స్థలాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్ అరుణశ్రీ
- వినియోగంలోకి తేవాలని అధికారులకు ఆదేశాలు



ఓసీపీ–4 ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

కోల్‌సిటీ(రామగుండం): నగరపాలక సంస్థను చాలాకాలంగా వెంటాడుతున్న డంపింగ్ యార్డు సమస్య ఓ కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ –(ఓసీపీ)4 సమీపంలో డంపింగ్‌యార్డ్ కోసం సింగరేణి సంస్థ స్థలాన్ని కేటాయించింది. ఇందులో భాగంగా శుక్రవారం ఓసీపీ–4 ప్రాంతాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, నగరపాలక సంస్థ ఎఫ్ఏసీ కమిషనర్ అరుణశ్రీ పరిశీలించారు. స్థలాన్ని వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పలువురు అధికారులు ఉన్నారు.

సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ సందర్శన..

రామగుండంలోని సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను అరుణశ్రీ సందర్శించారు. పూర్తి సామర్థ్యంతో పనిచేసేందుకు అవసరమైన సిబ్బందిని నియమించాలని అధికారులను ఆదేశించారు. నీటిని శుద్ధి చేసిన తర్వాతే బయటకు విడుదల చేయాలని సూచించారు. అలాగే ప్లాంట్‌లో పని చేసే సిబ్బందికి మరుగుదొడ్లు తదితర వసతులు కల్పించాలని ఆమె ఆదేశించారు.

హిందూ శ్మశానవాటిక పరిశీలన..

గోదావరి ఒడ్డున ఉన్న హిందూ శ్మశానవాటికను ఎఫ్ఏసీ కమిషనర్ అరుణశ్రీ సందర్శించారు. అంత్యక్రియల కోసం వచ్చేవారికి ఇబ్బంది కలుగకుండా వసతులు, సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఇక్కడ చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని అన్నారు. నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ రాయలింగు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామన్, డీఈ శాంతిస్వరూప్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ మధుకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నాగభూషణం, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల వంటావార్పు

- ఎన్టీపీసీ వైఖరిపై నిరసన



వంటల తయారీతో గీత కార్మికుల నిరసన

పాలకుర్తి(రామగుండం): రాణాపూర్ గ్రామ రెవెన్యూ శివారులో ఇటీవల ఎన్టీపీసీ విద్యుత్ కేంద్రాల స్థాపన నిమిత్తం ఈతవనాలను ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గీత కార్మికులు ఈతవనాల ప్రాంతాల్లో శుక్రవారం వంటావార్పుతో నిరసన తెలిపారు. నవరత్న కంపెనీగా ప్రఖ్యాతిగాంచిన ఎన్టీపీసీ నిర్వాసితులపై నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించడం శోచనీయమన్నారు. గౌడకుల వృత్తిని సర్వనాశనం చేస్తుండడంతో వందలాది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గౌడ కులస్తులకు వివిధ గ్రామాల గౌడ సంఘాల సొసైటీలు మద్దతు ప్రకటించాయి. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ మాట్లాడుతూ గౌడ కుల వృత్తిదారుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఎన్టీపీసీ వైఖరిని తప్పుపట్టారు. విద్యుత్ కేంద్రాలను స్థాపించే ముందు సర్వస్వం త్యాగం చేసే నిర్వాసితుల ప్రయోజనాలను కాలరాయడం సరికాదని అన్నారు. నిర్వాసిత కుటుంబాలకు ఆర్థిక, ఉపాధి ప్రయోజనాలపై హామీ ఇచ్చిన తర్వాత విద్యుత్ కేంద్రాలను స్థాపించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గీత కార్మికులు చేపడుతున్న వంటావార్పుకు గౌడ సంఘాల ప్రతినిధులు, రైతుకూలీ సంఘం ప్రతినిధులు కోట రవిగౌడ్, ముడిమడుగుల మల్లన్న, ఎరుకల రాజన్న, బాలసాని స్వామిగౌడ్, మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు నాగభూషణం, సర్వాయిపాపన్న రాష్ట్ర అధ్యక్షుడు జాగిరి అంజన్‌కుమార్, రాణాపూర్ మాజీ సర్పంచ్ ఆడెపు శ్రీనివాస్ సంఘీభావం ప్రకటించారు.

పల్లెలకు పక్కా రోడ్లు

- ఎమ్మెల్యే విజయరమణారావు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: ప్రతీ పల్లెను అనుసంధానిస్తూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు పక్కా రోడ్లు నిర్మిస్తామని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. కాపులపల్లి – గోపయ్యపల్లి వరకు రూ.కోటి వ్యయంతో చేపట్టిన బీటీ రోడ్డు పనులను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. పల్లె ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తామన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టినా.. ఆర్థిక క్రమశిక్షణతో అభివృద్ధి బాటలోకి తీసుకెళ్తున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. పంచాయతీరాజ్ ఈఈ గిరీశ్‌బాబు, డీఈఈ శంకరయ్య, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, వైస్‌చైర్మన్ మల్లారెడ్డి, నాయకులు ఎడెల్లి శంకర్, మల్లయ్య, గోపు శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.

ఆధునిక డిజైన్లలో కుట్టుశిక్షణ

మహిళలు ఆర్థికాభ్యున్నతి సాధించేందుకు స్వయం ఉపాధి అవసరమని, కుట్టుపనిలో ఆధునిక డిజైన్లలో శిక్షణ ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మహిళలకు ఆయన సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్ల స్వ రూపా, డాక్టర్ టి.వెంకటేశ్వర్ రావు, నాయకులు మల్లన్న, సంపత్, సుభాష్, అమ్రేష్, మస్రత్, సజ్జద్ తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా అమలు చేస్తున్నాం

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): కాంగ్రెస్ ప్రభుత్వం మాటకు కట్టుబడి దశలవారీగా పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. నారాయణరావుపల్లి–సాంబయ్యపల్లి మధ్య రూ.కోటితో చేపట్టిన బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఏఎంసీ చైర్మన్ ప్రకాశ్‌రావు, ఎంపీడీవో దివ్యదర్శన్ పాల్గొన్నారు. కాగా, గర్రెపల్లి మండలం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించేలా కృషి చేసిన ఎమ్మెల్యేను ప్రజాప్రతినిధులు, నేతలు సన్మానించారు.

క్లుప్తంగా

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

పెద్దపల్లిరూరల్: ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని కిసాన్‌నగర్‌కు చెందిన రావుల చారి(55) చాలాకాలంగా భార్యాపిల్లలకు దూరంగా ఉంటున్నాడు. శుక్రవారం పెద్దపల్లి పట్టణ శివారులోని పెద్దపల్లి–మంథని రైల్వే వంతెన సమీపంలో నాగ్‌పూర్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడ్డాడు. అతని ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి వద్ద లభించిన ఫోన్ నంబర్ ఆధారంగా అతని కుమారుడు సందీప్‌కు సమాచారం ఇచ్చి, మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ పేర్కొన్నారు.

సీడీపీవో పరీక్షలు ప్రశాంతం

రామగిరి(మంథని): మంథని జేఎన్‌టీయూ లో శుక్రవారం టీజీపీఎస్‌సీ ఆధ్వర్యంలో చేపట్టిన సీడీపీవో పరీక్షలు ప్రశాంతంగా జరిగా యి. ఉదయం, సాయంత్రం నిర్వహించిన ప రీక్షలకు వందమంది అభ్యర్థులకు 52 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. రామగిరి ఎస్సై చంద్రకుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ రాంచందర్‌రావు పరీక్షలను పర్యవేక్షించారు.

ఎల్‌వోసీ అందజేత

ఎలిగేడు(పెద్దపల్లి): కాట్నపల్లి గ్రామానికి చెందిన అంజమ్మ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతోంది. ఆమె వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.1,50,000 ఎల్‌వోసీ మంజూరైంది. దీంతో శివపల్లిలోని తన నివాసంలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు శుక్రవారం అంజమ్మ కుటుంబసభ్యులకు చెక్కు అందజేశారు.

జాతీయ రహదారి పనులకు టెంచ్

ముత్తారం(మంథని): వివిధ గ్రామాల్లో జాతీయ రహదారి పనులు సజావుగా జరగడానికి వీలుగా అధికారులు శుక్రవారం టెంచ్ కొట్టించారు. మైదంబండ, పోతారంలో నేషనల్ హైవే పనులు చేపట్టే భూముల్లో తహసీల్దార్ సుమన్, ఎస్సై నరేశ్ ఆధ్వర్యంలో టెంచ్‌లు కొట్టించారు. రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం ఇవ్వడానికి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయని, నిర్వాసితులు సహకరించాలని తహసీల్దార్ కోరారు. అడ్డుకునే ప్రయత్నం చేయరాదని ఆయన వివరించారు.

వాహనదారుకు జరిమానా

భీమారం: మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారిపై భీమారం సమీపంలో శుక్రవారం కోతులకు ఆహారం అందించిన వాహనదారుకు రూ.3వేల జరిమానా విధించినట్లు మంచిర్యాల ఎఫ్‌డీవో సర్వేశ్వర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా ముగ్దుంపూర్‌కు చెందిన బండి ఓదెలు వాహనంలో వెళ్తూ అటవీ ప్రాంతంలో కోతులు కనిపించగానే వాటికి ఆహారం వేశాడని తెలిపారు. దీంతో ఆయనకు జరిమానా విధించామన్నారు. వాహనచోదకులు, ప్రయాణికులు రిజర్వు ఫారెస్టులో రోడ్డుపై సంచరించే కోతులకు ఆహారం వేయొద్దని సూచించారు.

గుట్టు విప్పేదెప్పుడో..?

- జాడలేని పోస్టుమార్టం రిపోర్టులు
- పెద్దాపూర్ గురుకులంలో వీడని భయం
- విద్యార్థులను బడికి పంపని తల్లిదండ్రులు
- సందేహాల తొలగింపులో అధికారుల నిర్లిప్తత


పెద్దాపూర్ గురుకులంలో జాగ్రత్త చర్యల్లో భాగంగా బావి పూడ్చుతున్న దృశ్యం

కోరుట్ల: ఇద్దరు విద్యార్థుల మృతి.. మరో ఆరుగురికి అస్వస్థత. ఆరు నెలల వ్యవధిలో వరుసగా మూడు ఘటనలు. కోరుట్ల మండలం పెద్దాపూర్ గురుకులంలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఎక్కడాలేని భయాందోళనలు. గురుకులంలో వరుసగా ఎందుకిలా జరుగుతుందన్న విషయంలో లెక్కలేని సందేహాలు.. అధికార యంత్రాంగం ఈ గుట్టు విప్పేందుకు సరైన రీతిలో స్పందించడంలేదన్న అనుమానాలు.. వెరసి పెద్దాపూర్ గురుకులంలో ఏం జరుగుతుందో అంతుచిక్కని అనిశ్చితి. డిసెంబర్ నెలలో ఇద్దరు విద్యార్థులు పాము కాటుకు గురై క్షేమంగా ఉన్నప్పటికీ, తల్లిదండ్రులు పాఠశాలకు తమ పిల్లలను పంపే విషయంలో భరోసా లేక బెదిరిపోతున్నారు.

ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదికలు ఏవి..?

పెద్దాపూర్ గురుకులంలో మొదటగా గత జూలై 25న 8వ తరగతి విద్యార్థి గణాదిత్య విషపురుగు కుట్టి మృతి చెందాడు. స్థానిక వైద్యాధికారులు పోస్టుమార్టం పరీక్షలు నిర్వహించారు. ఈ నివేదిక ఏమిటన్న విషయంలో ఇప్పటికీ తెలియరాలేదు. తర్వాత ఆగస్టు 8న ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి ఎడ్మల అనిరుధ్ మృతిచెందాడు. ఆ సమయంలోనూ స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ రెండు సందర్భాల్లోనూ నిర్వహించిన పోస్టుమార్టం నివేదికల గుట్టు ఇప్పటికీ తేలలేదు. ఈ రెండు ఘటనల్లోనూ పాము కాట్లు ఉన్నాయన్న అనుమానంతో మరో నలుగురు విద్యార్థులకు యాంటి స్నేక్ వీనమ్ ట్రీట్‌మెంట్ ఇచ్చారు. వారంతా కోలుకుని బాగానే ఉన్నారు. ఇదే క్రమంలో పెద్దాపూర్ గురుకుల ఆవరణ పరిసరాలు, ఫర్నిచర్ ఏర్పాటుతో పాటు పెద్ద ఎత్తున జాగ్రత్త చర్యలు చేపట్టారు. పూర్తి స్థాయిలో గురుకుల పరిసరాలు బాగుపడ్డాయని తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకునే లోపే..డిసెంబర్ 18న మరో ఇద్దరు విద్యార్థులు గుర్తు తెలియని విషపురుగు కుట్టి అస్వస్థత పాలయ్యారు. మళ్లీ వైద్యాధికారులు యాంటి వీనమ్ ట్రీట్‌మెంట్‌ను ఆశ్రయించి చికిత్స అందించగా వారిద్దరూ కోలుకున్నారు. మళ్లీ తల్లిదండ్రుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. పూర్తి స్థాయిలో అవాంఛనీయ ఘటనలు ఎదురుకాకుండా చర్యలు చేపట్టాలని ఆందోళనలో ఉన్నారు.

తల్లిదండ్రులను వీడని భయం

గురుకులంలో ఇద్దరు విద్యార్థుల మృతికి కారణాలు వెల్లడి కాకపోవడంతో తల్లిదండ్రుల్లో భయం వీడటం లేదు. పెద్దాపూర్ గురుకులంలో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు సుమారు 504 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వరుస సంఘటనలు చోటు చేసుకోవడంతో ప్రస్తుతం పాఠశాలకు వస్తున్న విద్యార్థుల సంఖ్య కేవలం 210 మందికి తక్కువగానే ఉన్నట్లు సమాచారం. చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను పంపించేందుకు సిద్ధంగా ఉన్నా, ఇద్దరు విద్యార్థుల మృతి, ఆరుగురి అస్వస్థతకు కారణాలు ఏమిటన్న విషయాన్ని ఎవరూ తేటతెల్లం చేయకపోవడం సమస్యగా మారింది. పోస్టుమార్టం, ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్టుల్లో ఏమి తేలిందన్న అంశం స్పష్టంగా అధికారులు వెల్లడించి విద్యార్థులకు ఏలాంటి ఇబ్బందులు రావన్న భరోసా ఇవ్వగలిగితేనే పెద్దాపూర్ గురుకులం మళ్లీ గాడిన పడుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇంటర్ విద్యార్థుల కొట్లాట

ఓ వైపు విద్యార్థుల ఆకస్మిక మృతితో పెద్దాపూర్ గురుకుల ప్రతిష్ట దిగజారుతున్న క్రమంలో విద్యార్థుల్లో క్రమశిక్షణ లోపించడం మరో సమస్యగా మారింది. రెండు రోజుల క్రితం ఓ ఇంటర్ విద్యార్థిని మరో నలుగురు విద్యార్థులు కొట్టినట్టు సమాచారం. ఈ క్రమంలో ఐదుగురు విద్యార్థులను కొన్నాళ్ల పాటు పాఠశాల నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిసింది.

నట్టల నివారణ మందులేవి?

- రెండేళ్లుగా పశువులకు అందని మందులు
- ప్రైవేటు దుకాణాలే దిక్కు
- పశువుల కాపరులపై ఆర్థిక భారం
- సిరిసిల్ల జిల్లాలో గేదెలు 1.12 లక్షలు
- గొర్రెలు, మేకలు 3.84లక్షలు


గొర్రెల మంద



ఇతను ముస్తాబాద్‌కు చెందిన గొర్రెలకాపరి బండారి పర్శరాములు. నలభై ఏళ్లుగా గొర్రెల కాపరిగా పనిచేస్తూ ఉపాధి పొందుతున్నాడు. మూడేళ్లుగా తన గొర్రెలకు సొంతంగానే నట్టల నివారణ మందు కొని వేయిస్తున్నాడు. ఆరు నెలలకోసారి రూ.4వేలు వెచ్చిస్తున్నాడు. ఒక్కోసారి నట్టల నివారణ మందులు సకాలంలో వేయక నష్టం కూడా జరిగింది.

ముస్తాబాద్(సిరిసిల్ల): పశువుల్లో నట్టల నివారణ మందులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో దొరకడం లేదు. పశుపోషకులు ప్రైవేట్ దుకాణాలలో కొంటూ ఆర్థికంగా నష్టపోతున్నారు. గత రెండున్నరేళ్లుగా ప్రభుత్వం ఆధ్వర్యంలో నట్టల నివారణ మందుల పంపిణీ నిలిచిపోయింది. దీంతో వేలాది పశువులు నట్టల వ్యాధితో బాధపడుతున్నాయి. ఎదుగుదల లోపించి గొర్రెలు, మేకల కాపలాదారులకు వ్యాపారం సరిగ్గా జరగడం లేదు.

డీవార్మింగ్‌కు దూరమే..

గతంలో పశుసంవర్ధకశాఖ అధికారులు పాడిరైతులు, గొర్రెల కాపరుల వద్దకు వెళ్లి వారు పెంచుతున్న జీవాలకు నట్టల నివారణ మందులు వేసేవారు. నాలుగేళ్ల క్రితం వరకు పశువులు, గొర్రెల మందల వద్దకే అధికారులు నట్టల నివారణ మందు తీసుకెళ్లి వేసేవారు. రెండున్నరేళ్లుగా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం అటకెక్కించింది. ఫలితంగా పశుపోషకులే సొంతంగా కొని వారి జీవాలకు వేయిస్తున్నారు .

జిల్లాలో పశువులు..
గేదెలు : 1.12 లక్షలు
గొర్రెలు : 3.10 లక్షలు
మేకలు : 74వేలు
కోళ్లు :1.10లక్షలు

మందులు ఇలా వేయాలి..

- దూడలు పుట్టిన ఏడు రోజుల్లోపే నట్టల నివారణ మందులు వేయాలి.
- గొర్రెలు, మేకలకు మూడు నుంచి నాలుగు నెలలకోసారి వేయాలి.
- పేడ పరీక్షలు చేసి, గుడ్లు కనిపిస్తే నట్టల నివారణ మందులు వేయాలి.
- గుమ్మడి పువ్వులను తినిపిస్తే కూడా నట్టల నివారణ చేయవచ్చు.
- లేగదూడలకు నట్టల నివారణ మందులు వేసి వాటి మరణాన్ని ఆపవచ్చు.
- వానాకాలంలో తొలకరి జల్లులు కురిసిన సందర్భంలో పచ్చగడ్డి మేసి జీవాలు, పశువుల్లో నట్టలు చేరే అవకాశం ఉంది. ఆ సమయంలో మందులు వేయాలి.

మందులు పంపిణీ చేయాలి



గత ప్రభుత్వం నట్టల నివారణ మందుల పంపిణీని నిలిపివేసింది. గొర్రెల కాపరులు, పాడిరైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. కాంగ్రెస్ సర్కార్ పశు వైద్యంపై దృష్టి పెట్టాలి. ఆరు నెలలకోసారి నట్టల నివారణ మందులు వేయాలి.

– ఎలుసాని దేవయ్య, ముస్తాబాద్

రెండున్నరేళ్లుగా లేవు

రెండున్నరేళ్లుగా పశువుల్లో నట్టల నివారణ మందుల పంపిణీ నిలిచిపోయింది. ఎవరైన గొర్రెల కాపరులు, పాడిరైతులు వస్తే వారికి మందులు సూచిస్తున్నాం. ఉన్నతాధికారులకు మందుల కోసం ప్రతిపాదనలు చేశాం. మందులు రాగానే పంపిణీ చేస్తాం.

– డాక్టర్ రవీందర్‌రెడ్డి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

‘ఫీజు’ బకాయిలు విడుదల చేయాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

కరీంనగర్: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ సంక్షేమ, యువజన, విద్యార్థి, మహిళా సంఘాల నాయకులు శుక్రవారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా రూ.5 వేల కోట్లకు పైగా, జిల్లాలో బీసీ విద్యార్థులకు రూ.131.35 కోట్లు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు రూ.171 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రావాల్సి ఉందన్నారు. గత మూడేళ్లలో రీయింబర్స్‌మెంట్ కోసం 1.30 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. రాష్ట్రంలోని 16.70 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం బడ్జెట్‌లో రూ.9,200 కోట్లు మాత్రమే కేటాయించిందని, అవి ఏ మూలకు సరిపోతాయని ప్రశ్నించారు. బకాయిలు చెల్లించకుంటే మంత్రులు, ఎమ్మెల్యేల కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందించారు. బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం, మహిళా అధ్యక్షురాలు గుంటి స్వరూప, బీసీ యువజన సంఘం నగర అధ్యక్షుడు అనుమాస నితిన్, యువజన సంఘం ప్రధాన కార్యదర్శి పెద్ది శ్రీనివాస్, బీసీ యువజన సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ లింగంపల్లి శ్రీనివాస్, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



కోరుట్ల: పట్టణంలోని ఝాన్సీ రోడ్‌లో గల ఓ సినిమా థియేటర్ వద్ద శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మృతుడి వయసు 45 నుంచి 50 ఏళ్లు ఉంటుందన్నారు. గుర్తుపట్టిన వారు కోరుట్ల సీఐ నంబర్ 87126 56820, ఎస్సై నంబర్ 87126 56820కు ఫోన్ చేయాలని సూచించారు.

ఆమె కళ్లు సజీవం


సరళ (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఎంప్లాయీస్ కాలనీకి చెందిన పున్నం సరళ (62) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందింది. సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు మచ్చగిరి నరహరి, ఉప్పుల మహేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ కల్వల దీప్తి కిషన్‌రెడ్డి మృతురాలి కుటుంబసభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించగా ఒప్పుకున్నారు. వరంగల్ ఎల్‌వీపీ టెక్నీషియన్ ప్రదీప్ సహకారంతో నేత్రాలను సేకరించి, హైదరాబాద్ ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంక్‌కు పంపించారు. సరళ భర్త రామ్‌రెడ్డి, కూతురు–అల్లుడు మంద పద్మ–ప్రవీణ్‌రెడ్డి, కుమారుడు అనిల్‌కుమార్‌లను అభినందించారు.

కోతుల దాడి.. విరిగిన విద్యార్థి కాళ్లు


రెండు కాళ్లు విరిగిన రఘువర్ధన్

కరీంనగర్: కరీంనగర్ జిల్లాకేంద్రంలోని మంకమ్మతోట ధన్గర్‌వాడీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులపై కోతులు చేశాయి. గురువారం సాయంత్రం కొంత మంది విద్యార్థులు పాఠశాలలోని రెండో అంతస్తులో ఉన్నారు. కోతుల గుంపుగా ఒక్కసారిగా వీరిపైకి చేరుకోవడంతో బెంబేలెత్తి తలోదిక్కు పారిపోయారు. కోతుల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో ఎనిమిదో తరగతి చదువుతున్న మద్ది రఘువర్ధన్ మొదటి అంతస్తు నుంచి జారి కింద పడ్డాడు. అతని రెండుకాళ్లు, వెన్నుపూస విరిగింది. పాఠశాల ఉపాధ్యాయ బృందం, 55వ డివిజన్ కార్పొరేటర్ పెద్దపల్లి జితేందర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స నిర్వహించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం అర్ధరాత్రి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి రెఫర్ చేశారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో స్వర్ణం


సంజన

కరీంనగర్ స్పోర్ట్స్: సీఎం కప్ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో కరీంనగర్ జీఆర్‌ఆర్ కరాటే అకాడమీ విద్యార్థిని మర్రి సంజన సత్తా చాటి, గోల్డ్ మెడల్ సాధించినట్లు కరాటే జిల్లా జట్టు మేనేజర్ ఐలయ్య తెలిపారు. హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో గత నెల 31 నుంచి ఈ నెల 2వ తేదీ వరకు నిర్వహించిన పోటీల్లో సీనియర్ బాలికల 55 కేజీలలోపు కేటగిరీలో సంజన పతకం గెలిచిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమెను జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి వి.శ్రీనివాస్ గౌడ్, ఒలింపిక్ సంఘం జిల్లా కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, కోచ్ గౌరు రాజిరెడ్డి తదితరులు శుక్రవారం అభినందించారు.

‘అల్ఫోర్స్’లో సావిత్రీబాయి పూలేకు నివాళి


నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

కొత్తపల్లి(కరీంనగర్): స్థానిక అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్లో శుక్రవారం సావిత్రీబాయి పూలే జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళి అర్పించారు. మన దేశంలో తొలి మహిళా టీచర్‌గా సావిత్రిబాయి ప్రత్యేక గుర్తింపు పొందారని, ఆమె ఆశయసాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని టీచర్లు సూచించారు. తన రచనల ద్వారా స్త్రీలను జాగృతం చేసి, విద్యారంగంలో రాణించేలా చూశారని కొనియాడారు. భర్త జ్యోతిబాపూలేతో కలిసి, గ్రామాల్లో పర్యటించి, మహిళలను చైతన్యపరిచారని, స్త్రీ విద్య కోసం పలు పాఠశాలలను స్థాపించారని తెలిపారు.

మద్యానికి బానిసైన కొడుకులు

- మనస్తాపంతో పురుగుల మందు తాగిన తండ్రి
- చికిత్స పొందుతూ మృతి


గంగాధర్ (ఫైల్)

వెల్గటూర్(ధర్మపురి): చేతికంది వచ్చిన కొడుకులు మద్యానికి బానిసగా మారి జులాయిగా తిరుగుతుండడంతో మనస్తాపం చెందిన తండ్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల వివరాలు.. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రానికి చెందిన బలాస్థి గంగాధర్(48)కు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారు మద్యానికి బానిసై ఏ పనీ చేయకుండా జులాయిగా తిరగడానికి అలవాటుపడ్డారు. తండ్రి ఎన్నిసార్లు చెప్పినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదు. డిసెంబర్ 31న ఇద్దరు కొడుకులు బాగా మద్యం తాగి తండ్రితో గొడవకు దిగారు. దీంతో మనస్తాపం చెందిన గంగాధర్ పురుగుల మందు తాగాడు. అతడిని బంధువులు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. శుక్రవారం పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సొంతింటి కల సాకారం దిశగా పోరు

- అన్ని కార్మిక సంఘాలు కలిసి రావాలి
- ఎస్‌సీఈయూ రాష్ట్ర అధ్యక్షుడు రాజిరెడ్డి



మాట్లాడుతున్న రాజిరెడ్డి

కోల్‌సిటీ(రామగుండం): సింగరేణి కార్మికుల సొంతింటి కల సాకారం దిశగా సీఐటీయూ అనుబంధ సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (ఎస్‌సీఈయూ) పోరాటం చేస్తుందని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజిరెడ్డి తెలిపారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులు ఉద్యోగ విరమణ చేశాక సొంతిల్లు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వారి సొంతింటి కల డిమాండ్‌పై సీఐటీయూ రెండున్నరేళ్లుగా అనేక ఆందోళన కార్యక్రమాలు చేపడుతోందన్నారు. సింగరేణి క్వార్టర్లనే కార్మికులకు కేటాయిస్తే అటు ప్రభుత్వానికి, ఇటు సింగరేణితోపాటు కార్మికులకు కూడా ఇబ్బందులు తలెత్తవని అభిప్రాయపడ్డారు. సింగరేణి వ్యాప్తంగా ఎక్కడెక్కడ ఎంత మేరకు స్థలం ఉంది? ఎన్ని క్వార్టులు నిర్మించారు? ఎన్ని శిథిలావస్థలో ఉన్నాయనే వివరాల గురించి సింగరేణి సీఎండీ, డైరెక్టర్లతోపాటు ఇటీవల సీఐటీయూ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి నివేదిక రూపంలో అందజేసినట్లు తెలిపారు. దీనిపై చర్యకు డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారని, త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కూడా కలిసి వివరిస్తామన్నారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు ముందు కార్మికుల సొంతింటి కల సాకారం చేస్తామని హామీలిచ్చిన అన్ని కార్మిక సంఘాలు.. ఇప్పుడు ఆ సమస్యను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా కార్మికుల సొంతింటి కల సాకారం కోసం అన్ని కార్మిక సంఘాలు ఐక్య పోరాటాలు చేయడానికి ముందుకు రావాలని ఆయన కోరారు. ఏఐటీయూసీకి రూ.500 చొప్పున చెల్లించడం ఏ కార్మికునికి కూడా ఇష్టంలేదని, కానీ గుడి పేరిట చందాలు వసూలు చేయడం దారుణమని ఆరోపించారు. దీనిపై యాజమాన్యం స్పందించేంత వరకూ ఆందోళన కార్యక్రమాలను చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు ఆరేపల్లి రాజమౌళి, మెండె శ్రీనివాస్, మహేశ్, వేణుగోపాల్ రెడ్డి, జావిద్, సదానందం, శ్రావణ్ ,మల్లయ్య, రమేశ్, గొల్ల రాజేందర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న సన్నిధి.. భక్తుల రద్దీ


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ: ఎములావాడ రాజన్నను శుక్రవారం దాదాపు 25 వేల మంది భక్తుల దర్శించుకున్నారని ఆలయ అధికారులు తెలిపారు. ధర్మగుండంలో స్నానాలు చేసి, కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి, కోడెమొక్కు చెల్లించుకున్నారు. నిలువెత్తు బెల్లం పంపిణీ చేశారు. స్వామివారికి అభిషేకాలు, అన్నపూజలు, కల్యాణం, సత్యనారాయణ వ్రతం జరిగాయి. అనంతరం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు, అనుబంధ దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

సోలార్ ప్లాంట్‌లో అగ్ని ప్రమాదం


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు 10 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌లో శుక్రవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. పొగ రావడంతో అధికారులు ఎన్టీపీసీ సీఐఎస్‌ఎఫ్ అగ్నిమాపక విభాగానికి సమాచారం అందించారు. సిబ్బంది రెండు ఫైరింజిన్ల సాయంతో మంటలు ఆర్పివేశారు. అయితే, ప్లాంట్‌లో విద్యుదుత్పత్తికి ఉపయోగించే బ్యాటరీ పేలడంతో ప్రమాదం జరిగినట్లు సమాచారం.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


ప్రశంసాపత్రం అందిస్తున్న శ్రీధర్‌రెడ్డి

ధర్మారం(ధర్మపురి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఇంగ్లిష్ లాంగ్వేజీ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒలింపియాడ్, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. నందిమేడారం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన జోషిత ప్రథమ, కొత్తూరు పాఠశాల విద్యార్థి అలేఖ్య ద్వితీయ, నందిమేడారం పాఠశాలకు చెందిన జశ్విత తృతీయ స్థానం సాధించింది. ఉపన్యాస పోటీల్లో ధర్మారం పాఠశాలకు చెందిన ఆర్.సనా ప్రథమ, మేడారం పాఠశాల విద్యార్థి జోషిత ద్వితీయ, అంజలి తృతీయ స్థానం సాధించింది. నందిమేడారం ఉన్నత పాఠశాల విద్యార్థిని జోషిత ఒలింపియాడ్‌లో ప్రథమ, ఉపన్యాసంలో ద్వితీయ స్థానం సాధించి రెండు విభాగాల్లో జిల్లా స్థాయికి ఎంపికైనట్లు కన్వీనర్లు శ్రీధర్‌రెడ్డి, మాలతీలత తెలిపారు. శ్రీధర్‌రెడ్డి, మాలతీలత మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లోని ఆంగ్లభాషా నైపుణ్యాలను వెలికితీసేందుకు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల ఉపాధ్యాయులు రాజకుమార్, అరుణ, శ్రీనివాస్‌చారి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

ఓదెల(పెద్దపల్లి): మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కొమిర గ్రామానికి చెందిన రేవంత్ సైన్యం రాష్ట్ర కమిటీ సభ్యుడు సుగుణాకర్‌రెడ్డి కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని శుక్రవారం ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఓదెలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అందుబాటులో లేక ఉన్నత విద్యాభ్యాసం కోసం పేద పిల్లలు పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని సీఎంకు వివరించారు. అందుకు సీఎం సానుకూలంగా స్పందించారని సుగుణాకర్‌రెడ్డి తెలిపారు.